సాక్షి హనుమకొండ

శుక్రవారం । 25 । ఆగస్టు । 2023



చిగురించిన ఆశలు..
టీచర్ పోస్టుల భర్తీ కోసం నిరీక్షిస్తున్న అభ్యర్థులకు శుభవార్త. త్వరలోనే పోస్టులు భర్తీ చేయనున్నట్లు విద్యాశాఖమంత్రి సబితాఇంద్రారెడ్డి వెల్లడించారు. - 8లో▸



మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి
పొదుపు సంఘాల బలోపేతమే సీఎం కేసీఆర్ లక్ష్యమని, రుణాలు పొందిన మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$32^0 / 24^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

నేడు వరలక్ష్మీ వ్రతం
హన్మకొండ కల్చరల్ : శ్రావణమాసం పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతం చేసుకోవడం సంప్రదాయం. నేడు జిల్లా వ్యాప్తంగా పలు దేవాలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, మహిళలు తమ ఇళ్లలోనే వ్రతం చేసుకోవడానికి సిద్ధమయ్యారు. వ్రతానికి అవసరమైన పూలు, పండ్లు, తమలపాకులు, లక్ష్మీరూపాలు, సుగంధ ద్రవ్యాల కొనుగోళ్లతో కూడళ్లు రద్దీగా మారాయి. ఎంజీఎం సమీపాన ఉన్న శ్రీరాజరాజేశ్వరీ ఆలయం, హంటర్‌రోడ్ సంతోషీమాత దేవాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాల కోసం అవసరమైన ఏర్పాట్లు చేశారు.

13 మంది డీబార్
కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో గురువారం నిర్వహించిన దూరవిద్య (ఎస్‌డీఎల్‌సీఈ) బీఏ, బీకాం, బీఎస్సీ ఫస్టియర్ పరీక్షల్లో 13 మంది విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడుతూ.. పట్టుబడి డీబార్ అయ్యారని పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు. వరంగల్ ఎల్‌బీ కళాశాలలో ఆరుగురు, ఏఎస్‌ఎంలో ఐదుగురు, సీకేఎంలో ఇద్దరు స్క్వాడ్‌కు పట్టుబడినట్లు పేర్కొన్నారు.

నేడు ఎన్‌సీసీ ఆర్మీ వింగ్ ప్రవేశాలు
కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఫస్టియర్ బీఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థులు ఎన్‌సీసీ ఆర్మీవింగ్ విభాగంలో చేరేందుకు ఈనెల 25న ఎంపిక ప్రక్రియ ఉదయం 9 గంటలు నిర్వహించనున్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య, ఎన్‌సీసీ ఆర్మీవింగ్ లెఫ్టినెంట్ డాక్టర్ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు.

సమగ్రంగా సర్వే చేయండి



విద్యారణ్యపురి: తొలిమెట్టు అమలు, విద్యార్థుల సామర్థ్యాల సాధన తదితర అంశాలను సమగ్రంగా సర్వే చేయాలని ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లను జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్ కోరారు. గురువారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు రెండ్రోజుల శిక్షణను ప్రారంభించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. మూడోతరగతి విద్యార్థులను ర్యాండమ్‌గా తీసుకుని జిల్లాలో ఎంపిక చేసిన 40 పాఠశాలల్లో ఈనెల 28, 29, 30 తేదీల్లో సర్వే నిర్వహించాలన్నారు. ఈశిక్షణలో హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాల ఉపన్యాసకులు మారోజు సోమయ్య, వెంకట్రామయ్య, భాస్కర్, రిసోర్స్‌పర్సన్లు నర్సింహస్వామి, కుమారస్వామి పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవు
వరంగల్: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు, అనవసరమైన అబార్షన్లు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటరమణ హెచ్చరించారు. వరంగల్‌లోని సంరక్ష సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఆయన గురువారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. లింగ నిర్ధారణ సెంటర్, ఫామ్ ఎఫ్ ఆడిట్, రిజిస్టర్లను పరిశీలించి సూచనలు చేశారు. ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు సంబంధించి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి హార్డ్ కాపీని ప్రతినెలా 5వ తేదీలోపు జిల్లా కార్యాలయంలో అందజేయాలని ఆదేశించారు. డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, స్టాటిస్టికల్ ఆఫీసర్ విజయలక్ష్మి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి పెంచాలి
విద్యారణ్యపురి: విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి పెంపొందించాలని జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్ కోరారు. గురువారం హనుమకొండలోని రీజనల్ సైన్స్ కేంద్రంలో బాలల సైన్స్ కాంగ్రెస్‌పై సంబంధిత ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులను జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో ప్రాజెక్టుల రూపకల్పన చేసేలా సంసిద్ధుల్ని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాంతీయ సైన్స్ కేంద్రం ఇన్‌చార్జ్ డాక్టర్ ఈర్ల రాకేశ్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసస్వామి, ప్రముఖ బాటనీ విభాగం ఆచార్యులు డాక్టర్ సుతారి సతీశ్, ఎన్‌సీఎస్‌సీ అకడమిక్ కో–ఆర్డినేటర్ దొంతుల శ్రీనివాస్, రిసోర్స్‌పర్సన్లు డాక్టర్ వాసు, డాక్టర్ బి.మన్మోహన్, ఎ.సంపత్, సైన్స్ కేంద్రం సూపరింటెండెంట్ వెంకటేశ్వర్‌రావు, ప్రాజెక్ట్ అసోసియేట్లు అభినవ్‌కాంబ్లె, అనిల్‌నటేషన్ పాల్గొన్నారు.

మాటల్లోనే మోడ్రన్

కదలికలేని కొత్త బస్టాండ్
- మంత్రి కేటీఆర్ భూమిపూజ చేసి రెండు నెలలు
- పాత బస్టాండ్ భవన శిథిలాలు కూల్చడంలోనూ నిర్లక్ష్యం
- టెండర్ పిలిచి సంస్థను ఎంపిక చేసినా ముందుకు పడని అడుగులు
- అలంకారప్రాయంగా తాత్కాలిక షెడ్లు



వరంగల్ కొత్త బస్టాండ్ నమూనా



వరంగల్ పాత బస్టాండ్



తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బస్టాప్ షెడ్లు

సాక్షి, వరంగల్: ప్రయాణికుల సౌకర్యార్థం ఆధునిక హంగులతో నిర్మించనున్న వరంగల్ మోడ్రన్ బస్టాండ్ నిర్మాణం ఇప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. బెంగళూరులోని ఇంటర్‌సిటీ బస్ టెర్మినల్(ఐసీబీటీ) తరహాలో కొత్త బస్టాండ్ నిర్మిస్తామని దాదాపు రెండేళ్ల నుంచి చెబుతున్న ప్రజాప్రతినిధులు.. కార్యాచరణకు తేవడంలో ఆసక్తి చూపడం లేదు. ఈఏడాది జూన్ 17న మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా మోడ్రన్ బస్టాండ్ నిర్మాణానికి భూమి పూజ చేసినా.. ఇప్పటికీ ఏ పని మొదలుకాలేదు. ప్రస్తుతమున్న పాత బస్టాండ్ శిథిలాలను ఏప్రిల్‌లోనే తొలగించేందుకు 'కుడా' టెండర్లు పిలిచి ఫైనల్ చేసినా.. ఆదిశగా సంబంధిత సంస్థ పనులు ఇంకా ప్రారంభించలేదు. రైల్వేస్టేషన్ ప్రాంగణాన్ని అనుకుని ఉన్న రోడ్డులో ప్రత్యామ్నాయ బస్టాండ్ ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేసినా వృథాగా మారాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై ప్రజలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

మొదలుకాని కూల్చివేతలు..
దాదాపు 25 ఏళ్ల క్రితం వరంగల్ బస్టాండ్ నిర్మించారు. ఇందులో లోకల్ బస్టాండ్, జిల్లా బస్‌స్టేషన్‌కు సంబంధించిన భవనాలున్నాయి. వాటిని కూల్చి శిథిలాలు తొలగించి తిరిగి ఉపయోగించుకునేవీలుండే ఫర్నిచర్, ఇతర సామగ్రి సేకరించాల్సి ఉంది. ఆ సైట్‌లో ఉన్న శిథిలాలను పూర్తిగా తొలగించి నిర్మాణం చేసేలా క్లియర్ చేయాలి. అగ్రిమెంట్ చేసుకున్న వారంలో పని ప్రారంభించి.. 15 రోజుల్లో పూర్తి చేయాలని ఏప్రిల్‌లో పిలిచిన టెండర్లలో పేర్కొన్నారు. అయినా ఆ దిశగా అడుగులు పడడం లేదు.

మెయిన్ టెండర్ అయితేనే పనులు..
ఇప్పుడేమో రూ.75 కోట్లతో మోడ్రన్ బస్టాండ్ నిర్మాణానికి టెండర్లు పిలిచామని, సెప్టెంబర్ 5వ తేదీ వరకు సమయం ఉందని 'కుడా' అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత ఏదైనా సంస్థను ఎంపిక చేసి మళ్లీ ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాలంటే సమయం నెలపైనే పట్టే అవకాశం ఉంది. ఈ లెక్కన అక్టోబర్ వరకు కూడా కొత్త బస్టాండ్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యే పరిస్థితి కనిపించట్లేదు. కనీసం పాత బస్టాండ్ భవన శిథిలాలు నేల మట్టం చేసే ప్రక్రియైనా మొదలవుతుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఇదంతా ఫైనల్ అయ్యే వరకు ఎన్నికల కోడ్ వచ్చినా.. ఆశ్చర్యపోనవసరం లేదన్న టాక్ కూడా వినిపిస్తోంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు దృష్టి సారించి అధికారులను సమన్వయం చేసుకుని పాత బస్టాండ్ భవన శిథిలాల కూల్చివేత మొదలుపెడితే.. మెయిన్ టెండర్ పూర్తయ్యే వరకు అంతా ఖాళీ జాగా ఉండి బస్టాండ్ నిర్మాణ పనులు మొదలు పెట్టవచ్చన్న వాదన నగరవాసులు, ప్రయాణికుల నుంచి వినిపిస్తోంది.

సకల సౌకర్యాల ప్రణాళిక ఇదే..
అన్ని జిల్లాల, రాష్ట్రాల బస్సులతో పాటు సిటీ బస్సులు ప్రయాణికులను తీసుకెళ్లేలా గ్రౌండ్ ఫ్లోర్‌లో 32 ప్లాట్‌ఫాంలు నిర్మిస్తారు. మరో ఐదు అంతస్తుల్లో వ్యాపార, వినోద వసతులు ఉండేలా కాంప్లెక్స్‌లు అందుబాటులోకి రానున్నాయి. సెల్లార్‌లో పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. అలాగే వరంగల్ రైల్వేస్టేషన్, 'నియో'కు అనుసంధానంగా వరంగల్ బస్టాండ్ ఉండేలా అండర్ వాక్.. లేదంటే స్కైవాక్ నిర్మించేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇవన్నీ పూర్తయితే ప్రయాణికులకు అధునాతన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి.

ముట్టడి ఉద్రిక్తం



పోలీసులు వేసిన ఇనుప కంచెకు ఇరువైపులా గుమిగూడి దాడికి పూనుకున్న ఇరువర్గాలు

- పశ్చిమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద టెన్షన్ టెన్షన్
- కర్రలు, రాళ్లతో బీఆర్‌ఎస్, బీజేపీ శ్రేణుల పరస్పర దాడులు



రాళ్లు విసురుతున్న బీజేపీ కార్యకర్తలు



కర్రలు విసురుతున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు

హన్మకొండ: పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలనే డిమాండ్‌తో బీజేపీ చేపట్టిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ క్యాంపు కార్యాలయం ముట్టడి ఉద్రిక్తంగా మారింది. బీజేపీ నాయకులు, కార్యకర్తలు ముట్టడికి వస్తున్నారనే సమాచారంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి క్యాంపు కార్యాలయానికి వెళ్లే రోడ్లను ఇనుప కంచె, ముళ్ల కంచెతో మూసి వేశారు. అంతకు ముందే బీఆర్‌ఎస్ కార్యకర్తలు క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేశ్‌రెడ్డి నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకుని ముళ్ల కంచెను చూసి ఆగిపోయారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తుండగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు జెండాలు పట్టుకుని ముందుకు వచ్చారు. ఇరు వర్గాలు కంచెకు ఇరువైపులా మోహరించారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు కర్రలతో దాడి చేయగా.. వాటిని బీజేపీ కార్యకర్తలు లాక్కోవడంతో రాళ్లదాడికి దిగారు. ఈ క్రమంలో బీజేపీ నాయకులు సైతం రాళ్లతో ఎదురుదాడి చేశారు. దీంతో ఆ ప్రాంతం రణరంగంగా మారింది. హనుమకొండ ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐలు చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. బీజేపీ నాయకులు కొద్ది దూరం వెళ్లగానే రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. పోలీసులు ఏనుగుల రాకేశ్‌రెడ్డితో పాటు పలువురు నాయకులను అరెస్టు చేసి మడికొండలోని పోలీసు ట్రెయినింగ్ సెంటర్‌కు తరలించారు. ఈదాడిలో హనుమకొండ ఎస్సై సతీష్‌కు మోచేతి వద్ద తీవ్ర గాయంకాగా.. బీజేపీ నాయకులు మేకల శ్రావణ్, కొత్తపల్లి రాజేష్ తలకు, గణేష్, నాగరాజుతో పాటు మరికొందరికి శరీరంపై గాయాలయ్యాయి. అంతకు ముందు హంటర్ రోడ్డులోని క్యాంపు కార్యాలయం వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మను పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఆమె వెనుకవైపు నుంచి రోడ్డుపైకి చేరుకున్నారు. అప్పటికే అక్కడికి చేరుకున్న నాయకులను, కార్యకర్తలను పోలీసులు స్టేషన్‌కు తరలించగా.. అందుబాటులో ఉన్న నాయకులు, కార్యకర్తలతో రావు పద్మ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి బయలుదేరగా.. పోలీసులు అడ్డుకున్నారు. ఈక్రమంలో జరిగిన తోపులాటలో రావు పద్మ స్పృహ తప్పి పడిపోయారు. పోలీసులు పద్మను జుట్టు పట్టి లాగడంతో మెడ, చేతికి గాయమైంది. అనంతరం పద్మతో పాటు నాయకులు, కార్యకర్తలను ధర్మసాగర్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. రాత్రి మూడో జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ఎదుట ప్రవేశ పెట్టగా రాకేశ్‌రెడ్డి సహా 21 మందికి బెయిల్ మంజూరు చేశారు. అనంతరం అమరవీరుల స్తూపం వరకు ర్యాలీగా చేరుకుని నివాళులర్పించారు.

నాపై హత్యకు కుట్ర చేశారు : రాకేశ్‌రెడ్డి
చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తన హత్యకు కుట్ర చేశారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేశ్‌రెడ్డి ఆరోపించారు. వినయ్‌భాస్కర్ తమ పార్టీ నాయకులు, కార్యకర్తల రక్తం కళ్ల చూశాడని, ఆయన అంతు చూస్తామన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు దాడి చేస్తుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని ఆరోపించారు. వినయ్‌భాస్కర్ తన రౌడీ రాజకీయం మొదలు పెట్టాడని, తామున్నది పేద ప్రజల కోసమని.. చావడానికైనా సిద్ధమన్నారు.

పోరంబోకు సర్కారు : రావు పద్మ
పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేని ఈ పోరంబోకు సర్కారు ప్రభుత్వ భూములను అమ్ముతూ ప్రశ్నించిన వారిపై అధికార బలాన్ని చూపుతోందని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ధ్వజమెత్తారు. అర్హులందరికీ ఇళ్లు ఇచ్చే వరకు ఎమ్మెల్యేను అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

నేడు కలెక్టరేట్ల వద్ద ధర్నా : కోవ లక్ష్మణ్
బీఆర్‌ఎస్ కార్యకర్తలు జరిపిన దాడిని నిరసిస్తూ ఈనెల 25న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా చేయాలని బీజేపీ ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కోవా లక్ష్మణ్ పిలుపునిచ్చారు. పోలీసులు, బీఆర్‌ఎస్ దాడిలో గాయపడిన బీజేపీ నాయకులను రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, రావు పద్మ, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు తదితరులతో కలిసి ఆయన పరామర్శించారు. అనంతరం హనుమకొండ వేద బాంక్వెట్ హాల్‌లో విలేకరులతో మాట్లాడుతూ బీజేపీని చూస్తే సీఎం కేసీఆర్‌కు భయం పట్టుకుందన్నారు. తమ పార్టీ చేస్తున్న పోరాటాలకు వణికిపోతూ నిర్బంధాలు విధిస్తూ.. పోలీసులు, పార్టీ నాయకులతో దాడి చేయిస్తున్నారని ధ్వజమెత్తారు.

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

చీఫ్ విప్ వినయ్‌భాస్కర్



దివ్యాంగులకు చెక్కు అందజేస్తున్న వినయ్‌భాస్కర్

హన్మకొండ అర్బన్: దివ్యాంగులకు సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో దివ్యాంగులకు పెంచిన పింఛన్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ దివ్యాంగులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన దివ్యాంగులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్, 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ రిజ్వాన్ బాషా, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కవులు, కళాకారులకు ప్రముఖ స్థానం
తెలంగాణలో కవులు, కళాకారులకు ప్రముఖ స్థానం ఉందని, ముఖ్యంగా ఓరుగల్లు కళలకు కేంద్రమని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. గురువారం 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషాతో కలిసి నగరంలోని జైన్ టెంపుల్, సరిగమ పార్కులను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా చీఫ్ విప్ మాట్లాడుతూ కళాకారుల కోసం నగరంలోని ఇప్పటికే రూ.75 కోట్లతో కాళోజీ కళాక్షేత్రం నిర్మిస్తున్నట్లు తెలిపారు. నగర ప్రజల ఉల్లాసం కోసం ఇప్పటికే భద్రకాళి బండ్, పబ్లిక్ గార్డెన్, డివిజన్లలో పార్కులు ఏర్పాటు చేశామన్నారు. త్వరలో సరిగమ పార్కును అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. సరిగమ పార్కులో 'కుడా', మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మౌలిక వసతులు కల్పించి, కళాకారులకు నిర్వహణ బాధ్యతలు అప్పగించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'అన్‌మ్యాన్డ్' వర్కర్లను ఆర్టిజన్లుగా గుర్తించాలి

- టీఎస్ యూఈఈయూ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఈశ్వర్‌రావు
- ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట మహాధర్నా



ధర్నా చేస్తున్న విద్యుత్ కార్మికులు

హన్మకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలో పని చేస్తున్న అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లను ఆర్టిజన్లుగా సంస్థలోకి విలీనం చేసుకోవాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఈశ్వర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట టీఎస్ యూఈఈయూ ఆధ్వర్యంలో వందలాది విద్యుత్ కార్మికులతో మహా ధర్నా నిర్వహించారు. టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 17 జిల్లాల నుంచి భారీగా విద్యుత్ అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లు, స్పాట్ బిల్లర్లు, బిల్ కలెక్టర్లు, ఎస్పీఎం స్టోర్ కార్మికులు భారీగా తరలివచ్చారు. పబ్లిక్ గార్డెన్ నుంచి ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, కార్యాలయం ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తూ మహాధర్నా నిర్వహించారు. ఈధర్నాలో సీఐటీయూసీ సీనియర్ నాయకుడు జి.ప్రభాకర్‌రెడ్డి, టీఎస్ యూఈఈయూ ఎన్పీడీసీఎల్ శాఖ కార్యదర్శి ఎం.ప్రసాద్, విద్యుత్ కార్మిక సంఘాల నాయకులు కొలగాని రమేశ్, రాజేశ్వరి పాల్గొన్నారు.

మురుగు కాల్వలో మొసలి

- ఉలిక్కిపడ్డ న్యూశాయంపేట వాసులు



మురికి కాల్వ ఒడ్డున మొసలి

కాజీపేట అర్బన్: న్యూశాయంపేట బస్టాండ్ ప్రాంతంలోని మురుగు కాలువలో గురువారం స్థానికులకు మొసలి కనిపించింది. బస్టాండ్ సమీపంలోని ఇళ్ల వెనకాల ఉన్న మురుగు నీటి పక్కన బండపై ఒక మొసలి, మురుగు నీటిలో మరో రెండు మొసళ్లు కనిపించాయి. దీంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. కాగా.. నాలాలను పరిశీలించేందుకు చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా, 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్ న్యూ శాయంపేటలో పర్యటించారు. మొసలి ఉన్న విషయం తెలుసుకున్న చీఫ్ విప్, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ఓ ఇంటిపై నుంచి మొసలి సంచారాన్ని పరిశీలించారు. చీఫ్‌విప్ మాట్లాడుతూ.. కాలనీలోని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. టౌన్ ప్లానింగ్ అధికారులకు పూర్తి స్థాయిలో సైడ్ డ్రెయిన్స్ నిర్మించాలని, మొసళ్ల సంచారం లేకుండా చర్యలు చేపట్టాలని జూపార్క్, ఫారెస్ట్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

తీజ్.. జోష్



హసన్‌పర్తి: తీజ్ ఉత్సవం గిరిజన యువతుల్లో జోష్ నింపింది. గురువారం గోపాలపురం, రామారం ప్రాంతాల్లో జరిగిన వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేశ్ హాజరయ్యారు. తీజ్ బుట్టలను ఎత్తుకుని యువతులను అనుసరిస్తూ వారితో కలిసి నృత్యం చేశారు. అనంతరం తీజ్‌ను స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. మాజీ ఎంపీ సీతారాంనాయక్, కార్పొరేటర్ సునీల్‌కుమార్, జక్కుల రజిత, దివ్యారాణి, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆపదలో 'అమ్మ'

తగ్గుతున్న బాలికల నిష్పత్తి
- ఏప్రిల్ ఒకటి నుంచి ఆగస్టు 22 వరకు 3,830 మంది శిశువుల జననం
- అందులో 2,045 మంది మగ శిశువులు..
- 1785 మంది ఆడ శిశువులు
- కొనసాగుతున్న లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు..!

వివక్ష వేళ్లూనుకుంటోంది. గుట్టుచప్పుడు కాకుండా లింగ నిర్ధారణ జరుగుతోంది. ఆడపిల్ల అని తెలిస్తే కడుపులోనే చిదిమేస్తున్నారు. ప్రభుత్వం ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా.. భ్రూణ హత్యలు ఆగట్లేదు. కొన్నాళ్లుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆడశిశువుల జననాలు తగ్గుతున్నాయి. ఇటీవల లింగ నిర్ధారణ ముఠా అరెస్టయినా.. మరికొన్ని చోట్ల యథేచ్ఛగా ఈదందా సాగుతోందనే విమర్శలున్నాయి. అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోకపోతే భవిష్యత్ తరాలకు 'అమ్మ' కరువయ్యే ప్రమాదం ఉంది. - సాక్షి, వరంగల్



జనాల్లో బాలిక నిష్పత్తి రోజురోజుకూ తగ్గుతూ వస్తోంది. చదువు, సంస్కారం ఉన్నవారు సైతం అమ్మాయిపై వివక్ష చూపుతూనే ఉన్నారు. ఎన్ని చట్టాలు ఉన్నా.. ప్రమాదం నుంచి మాతృత్వాన్ని కాపాడలేక పోతున్నారు. వరంగల్ నగరంతో పాటు జిల్లాలో ఈ ఏడాది మే ఒకటి నుంచి ఆగస్టు 22 వరకు 3,830 మంది శిశువులు జన్మించారు. ఇందులో 2,045 మంది మగ శిశువులు ఉంటే.. ఆడపిల్లలు 1,785 మంది ఉన్నారు. లింగ నిష్పత్తి పరిశీలిస్తే 260 సంఖ్య తేడా కనిపిస్తోంది. ఇది జిల్లా వైద్యారోగ్య అధికారిక గణాంకాల ప్రకారమే. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలతో పాటు భ్రూణ హత్యలు జరుగుతున్నాయనడానికి ఈ లెక్కలే నిదర్శనమన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఇప్పటికే మే 29న లింగ నిర్ధారణ పరీక్షలతో సంబంధమున్న ప్రభుత్వ వైద్యులతో సహా 18 మందిని వరంగల్ కమిషనరేట్ పోలీసులు అరెస్టు చేయడం సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయినా ఇప్పటికీ వరంగల్ నగరంతో పాటు నర్సంపేట తదితర ప్రాంతాల్లోని వివిధ ఆస్పత్రులు, క్లినిక్‌ల్లో గుట్టుచప్పుడు కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని తెలుస్తోంది.

అధికారుల నిర్లక్ష్యం..
ముఖ్యంగా వైద్యారోగ్య శాఖ విభాగాధికారుల నిర్లక్ష్యంతోనే ఆయా ఆస్పత్రులు, క్లినిక్, స్కానింగ్ కేంద్రాల్లో యథేచ్ఛగా లింగ నిర్ధారణ పరీక్షల దందా సాగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల జిల్లా మల్టీ మెంబర్ అప్రోప్రైట్ అథారిటీ అధ్యక్షతన గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టంలో దరఖాస్తు చేసుకున్న స్కానింగ్ సెంటర్లకు అనుమతిచ్చారు. 2001 నుంచి పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్ కింద అల్ట్రా సౌండ్ స్కానింగ్ క్లినిక్‌లు, ఇమేజింగ్ సెంటర్లు ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ అయినవి 102 ఉంటే.. 68 మాత్రమే నడుస్తున్నాయని, 34 నడవడంలేదని వైద్యాధికారులు చెబుతున్నారు.

కఠినంగా వ్యవహరించాల్సిందే..
కేసీఆర్ కిట్ ప్రకారం జిల్లాలో 1,000 మంది మగ పిల్లలకు ఆరేళ్ల పిల్లలు 873 మంది మాత్రమే ఉండడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. ఇటు ఆస్పత్రులు, అటు స్కానింగ్ కేంద్రాల్లోని బోర్డులపై లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని ప్రదర్శిస్తున్నా కొందరు వైద్యుల కాసుల కక్కుర్తితో ఆడపిల్లలను కడుపులోనే చిదిమేస్తున్నారన్న విషయాన్ని మూడు నెలల క్రితం పోలీసుల దాడుల్లో పట్టుబడిన లింగ నిర్ధారణ ముఠాతో బహిర్గతమైంది. అయినా ఇప్పటికీ గుట్టుచప్పుడు కాకుండా ఎక్కడికక్కడా లింగ నిర్ధారణ పరీక్షలు, ఆపై భ్రూణహత్యలు జరుగుతున్నాయనే ఆరోపణలుండడం ఆందోళన కలిగిస్తోంది. దీనిపై జిల్లావైద్యారోగ్య అధికారులు కఠినంగా వ్యవహరిస్తేనే ఆడపిల్లల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్న వాదన బలంగా వినిపిస్తోంది.

లింగ వ్యత్యాసంపై అధ్యయనం చేస్తాం..
దుగ్గొండి మండలంలో 95 మంది మగ పిల్లలు పుడితే 68 మంది మాత్రమే ఆడ పిల్లలు ఉన్నారు. దీనికి విరుద్ధంగా గీసుగొండ మండలంలో 96 మంది మగపిల్లలు పుడితే 111 మంది ఆడ పిల్లలు జన్మించారు. లింగ వ్యత్యాసం అధికంగా ఉన్న మండలాల్లో క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలకు శ్రీకారం చుడతాం. భవిష్యత్‌లో ఎదురయ్యే పరిణామాల గురించి వివరిస్తాం. అలాగే ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్ల కార్యకలాపాలపై నిఘా ఉంచుతాం.

- డాక్టర్ వెంకటరమణ,
జిల్లా వైద్య, ఆరోగ్యాధికారి, వరంగల్

ఏప్రిల్ ఒకటి నుంచి ఈనెల 22 వరకు జన్మించిన శిశువుల గణాంకాలిలా..

మండలం	బాలురు	బాలికలు
దుగ్గొండి	95	68
పర్వతగిరి	119	89
నెక్కొండ	104	78
సంగెం	107	83
రాయపర్తి	139	109
నర్సంపేట	169	133
ఖానాపురం	71	58
వరంగల్	392	341
చెన్నారావుపేట	119	106
ఖిలావరంగల్	453	427
వర్ధన్నపేట	108	105
నల్లబెల్లి	73	77
గీసుకొండ	96	111
మొత్తం	2,045	1785

మాజీ కార్పొరేటర్‌పై కేసు

ఖిలా వరంగల్ : వరంగల్ లక్ష్మీనగర్ శాకరాసికుంట సమీపంలోని ఓ నిర్జీవ ప్రదేశంలో బుధవారం రాత్రి కారు పార్క్ చేసి మద్యం సేవిస్తున్న ఓ మాజీ కార్పొరేటర్‌పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదైంది. మద్యం సేవిస్తూ పోలీసులను చూసి కారులో ముందుకెళ్తున్న ఆయనను పట్టుకుని మిల్స్‌కాలనీ పోలీస్‌స్టే షన్‌కు తరలించారు. అనంతరం అతడిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి గురువారం తెల్లవారు జామున వదిలేసినట్లు సీఐ టి. సురేష్ తెలిపారు.

అల్లుడి దాడి.. అత్త మృతి

రామన్నపేట : అల్లుడి దాడిలో అత్త మృతి చెందింది. మట్టెవాడ ఎస్సై నవీన్ కథనం ప్రకారం వృద్ధురాలు సామల వెంకటమ్మ(78) తన నాలుగో కూతురు వంగ సునీతతో కలిసి వరంగల్ సుజీత్‌నగర్‌లో నివాసముంటోంది. సునీత భర్త సంపత్ నిత్యం వెంకటమ్మను దూషించడంతోపాటు ఘర్షణకు దిగేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం సంపత్ తన భార్య, కొడుకును ఓ గదిలో ఉంచి వెంకటమ్మ తలపై సుత్తితో కొట్టాడు. తీవ్రగాయాలపాలైన వృద్ధురాలిని వెంటనే ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందింది. మృతురాలి పెద్ద కూతురు శోభారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మట్టెవాడ ఎస్సై నవీన్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్‌కు చెందిన వీరాంజన్(32) గురువారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లిదండ్రులు వేరే ఊరికి వెళ్లి తిరిగి వచ్చి చూడగా వీరాంజన్ ఉరేసుకుని మృతి చెంది ఉన్నాడు. కాగా, మృతుడి కాళ్లకు రక్తం మరకలు ఉండడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చిగురించిన ఆశలు..

- టీచర్‌పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్
- డీఎస్సీతోనే నియామకం
- రెండు రోజుల్లో విధివిధానాలు ఖరారు?



విద్యారణ్యపురి: సుదీర్ఘకాలంగా టీచర్ పోస్టుల భర్తీ కోసం నిరీక్షిస్తున్న డీఎడ్, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులకు శుభవార్త. త్వరలోనే ఈ పోస్టుల భర్తీకి ఉపక్రమించబోతున్నట్లు విద్యాశాఖమంత్రి సబితాఇంద్రారెడ్డి గురువారం వెల్లడించారు. అయితే ఈసారి టీఆర్‌టీ ద్వారా కాకుండా పాతపద్ధతి డీఎస్సీ ద్వారానే భర్తీచేయబోతున్నారు. రాతపరీక్ష అనంతరం జిల్లా సెలక్షన్ కమిటీ భర్తీ చేయనుంది. అందుకు రెండు మూడురోజుల్లో కలెక్టర్లు విధివిధానాలు ప్రకటిస్తారని సమాచారం. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీఈడీ, డీఎడ్ పూర్తిచేసిన అభ్యర్థుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికే టీచర్ ఎల్జిబులిటీ టెస్టు (టెట్) నిర్వహణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. ఈఏడాది సెప్టెంబర్15న టెట్ నిర్వహిస్తారు. అదే నెలలో 27న ఫలితాలను విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో టెట్‌కు అభ్యర్థులు ప్రిపేర్ అవుతున్నారు. ఇప్పుడు టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ కూడా రానుండడంతో ఆయా అభ్యర్థుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

జిల్లాలవారీగా ఎన్ని వెకెన్సీలు భర్తీచేస్తారు!

ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీఎడ్, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులు వేలాది మంది ఉన్నారు. దీంతో వీరు కొన్నేళ్లుగా టీచర్ పోస్టుల భర్తీ కోసం నిరీక్షిస్తున్నారు. 2017లో టీఆర్‌టీ ద్వారా టీచర్ల పోస్టుల భర్తీ చేశాక మళ్లీ ఇప్పటి వరకూ జరగలేదు. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆరు జిల్లాలుగా హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి విభజించబడింది. ఈ నేపథ్యంలో ఏ జిల్లా నియామకాలు ఆ జిలాలోనే కొనసాగుతాయి. అయితే అభ్యర్థుల్లో వివిధ కేటగిరీల్లో ఎన్ని పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయి.. అందులో ఎన్ని భర్తీ చేస్తారనే అంశం ఆసక్తిగా మారింది. రాష్ట్రంలో మాత్రం 5,089 టీచర్ పోస్టులు మాత్రమే భర్తీచేస్తారని, స్పెషల్‌ఎడ్యూకేషన్ లో1523 టీచర్‌పోస్టులు భర్తీచేయబోతున్నారని సమాచారం. అంతకంటే ఎక్కువగానే పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యను బట్టే వేకెన్సీలను భర్తీచేయబోతున్నారని సమాచారం.

హనుమకొండ జిల్లాలో 318 పోస్టులు ఖాళీ..

హనుమకొండ జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 2,693 పోస్టుల మంజూరు ఉండగా అందులో 2,375మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 318 పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయి. గ్రేడ్ 1 హెచ్‌ఎం పోస్టులు ఒకటి వేకెన్సీగా ఉండగా గ్రేడ్ హెచ్‌ఎంలు 46 ఉన్నాయి.ఎస్‌జీటీ తెలుగు మీడియం 74, ఉర్దూమీడియం 8 పోస్టులు వేకెన్సీగా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్స్ మ్యాథ్స్ 7, ఫిజిక్స్ 4, బయోసైన్స్ 17, సోషల్‌స్టడీస్ 38 , తెలుగు 9, హిందీ 8, ఉర్దూ 1, ఫిజికల్ ఎడ్యూకేషన్ 5, పీఎస్‌హెచ్‌ఎం 45,ఎల్‌పీ తెలుగు 2, ఎల్‌పీ హిందీ 3, పీఈటీ 6, ఆర్ట్ డ్రాయింగ్ టీచర్ 8, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్స్ 17, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ 4 వేకెన్సీలుగా ఉన్నాయి.

జనగామ జిల్లాలో 426 పోస్టులు..

జనగామ జిల్లాలో అన్ని కేటగిరీల కలిపి 426 టీచర్ పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయి. జిల్లాలో 2,570 కేడర్ స్ట్రెంత్ (పోస్టుల మంజూరు) ఉండగా అందులో 2,144మంది పనిచేస్తున్నారు.హెచ్‌ఎం పోస్టులు 49, పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు 57, స్కూల్ అసిస్టెంట్లు 167, ఎస్‌జీటీ పోస్టులు 118, పండిట్లు 21, పీఈటీలు 7వేకెన్సీలుగా ఉండగా ఇంకా వివిధ కేటగిరీలో పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయి.

మహబూబాబాద్‌జిల్లాలో 595..

మహబూబాబాద్‌జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 595 టీచర్ పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయి. జిల్లాలో 3,681 టీచర్ల కేడర్ స్ట్రెంత్ ఉండగా అందులో 3,086 మంది పనిచేస్తున్నారు.595 వేకెన్సీలుగా ఉన్నాయి. హెచ్‌ఎం పోస్టులు 39, పీఎస్‌హెచ్‌ఎం 70, మ్యాథ్స్ 20, ఫిజిక్స్ 8, బయోసైన్స్ 53, సోషల్‌స్టడీస్ 62, తెలుగు 18, హిందీ 10, ఇంగ్లిష్ 24, ఫిజికల్ ఎడ్యూకేషన్ 8 ఎల్‌పీ తెలుగు 14, ఎల్‌పీ హిందీ 5, పీఈటీ 2, ఎస్‌జీటీ పోస్టులు 262 వేకెన్సీలుగా ఉన్నాయి.

- వరంగల్‌జిల్లాలో అన్నికేటగిరీల టీచర్ పోస్టులుకలిపి 490వరకు వేకెన్సీలుగా ఉన్నాయని సమచారం,
- ములుగు జిల్లాలో 300లకుపైగా టీచర్‌పోస్టులు వెకెన్సీలుగా ఉన్నాయని సమాచారం.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోఅన్ని కేటగిరీలు కలిపి 325కుపైగా టీచర్ పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయని సమాచారం. వేకెన్సీల్లో కొంతశాతం పదోన్నతుల ద్వారా, మరికొంత డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేస్తారు.జిల్లా కలెక్టర్లు విధివిధానలను ప్రకటించాకా త్వరలోనే నోటిఫికేషన్ కూడా ఇస్తారనేది సమాచారం.

సర్కారు బడికే జై..

- తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన తహసీల్దార్
- అభినందించిన పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు



కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న తహసీల్దార్ సరస్వతి

చిల్పూరు : ప్రస్తుత కాలంలో సామన్యుల నుంచి.. సంపన్నుల వరకు.. నిరక్షరాస్యుల నుంచి.. ఉన్నత విద్యావంతుల వరకు.. కిందిస్థాయి సిబ్బంది నుంచి.. ఉన్నతాధికారుల వరకు అందరూ తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఫలితంగా విద్యార్థులు లేక ప్రభుత్వ పాఠశాలలు మూతబడే పరిస్థితులు నెలకొంటున్నాయి. అయితే వీరందరికీ చిల్పూరు తహసీల్దార్ సరస్వతి భిన్నం. తన కుమారుడు శ్రీవర్ధన్‌ను గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతిలో చేర్పించారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు పేరు నమోదు చేసుకుని పుస్తకాలు అందజేసి తరగతిగదిలో కుర్చోబెట్టారు. దీంతో తహసీల్దార్‌పై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధ్యాయులు రాధాకృష్ణ, వేణు, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

గుడిసెల తొలగింపు.. సీపీఎం ఆందోళన



రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

రామన్నపేట : దేశాయిపేట శివారు ప్రభుత్వ భూమిలో వెలిసిన 1600 గుడిసెలను పోలీసులు బుధవారం అర్ధరాత్రి తొలగించారు. గుడిసెల తొలగింపుకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో గురువారం పోచమ్మమైదాన్ జంక్షన్‌లో రాస్తారోకో, ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య మాట్లాడుతూ పోలీసులు నిర్ధాక్షణ్యంగా గుడిసెలు నేలమట్టం చేశారని మండిపడ్డారు. గుడిసెలు వేసుకున్న పేదలకు ప్రభుత్వం వెంటనే ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు పూర్తయినా ఇండ్లు లేని నిరుపేదలకు ఇంత వరకు స్థలాలు కేటాయించలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రత్నమాల, బాబు, రామస్వామి, జిల్లా కమిటీ సభ్యులు సాగర్, అరూరికుమార్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు కబ్జారాయుళ్ల పై పీడీ యాక్ట్



పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందజేస్తున్న సీఐలు

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు కబ్జారాయుళ్లపై సీపీ రంగనాథ్ పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏనుమాములలో నివాసముంటున్న జన్ను అనిల్, గీసుకొండ మండలం కీర్తినగర్ ప్రాంతానికి చెందిన పోలెపాక విజయ్‌పై పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఇంతేజార్‌గంజ్, మిల్స్ కాలనీ సీఐలు శ్రీనివాస్, సురేష్ గురువారం హైదరాబాద్‌లోని చర్లపల్లి కారాగారంలో జైలర్ సమక్షంలో వారికి పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందజేశారు. నిందితులు ఖాళీ స్థలాలపై కన్నేసి తప్పుడు ధ్రువపత్రాలను సృష్టించి వాటి ద్వారా అసలు స్థల యజమానులను బెదిరిస్తూ భూ కబ్జాలకు పాల్పడడంతో పాటు ఇబ్బందులకు గురిచేసేవారని తెలిపారు. ఈ తరహా కేసుల్లో జన్ను అనిల్‌పై ఇంతేజార్‌గంజ్ పీఎస్ పరిధిలో రెండు, పోలెపాక సంజీవ్ పై మిల్స్ కాలనీ పీఎస్ పరిధిలో మూడు కేసులు నమోదైనట్లు తెలిపారు.

మార్కెట్‌లోకి హెచ్‌పీ ఫ్లేమ్‌ప్లస్ గ్యాస్



బ్రోచర్‌ను అవిష్కరిస్తున్న మహేష్‌రామ్

హన్మకొండ అర్బన్ : నగరంలోని కమర్షియల్ గ్యాస్ వినియోగదారుల కోసం హెచ్‌పీ(హిందూస్థాన్ పెట్రోలియం) గ్యాస్ ఆధ్వర్యంలో వినూత్నంగా ఫ్లేమ్ ప్లస్ సిలిండర్లను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు సంస్థ సౌత్ సెంట్రల్ జోన్ జీఎం మహేష్‌రామ్ తెలిపారు. ఈ మేరకు గురువారం సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ ఫ్లేమ్ ప్లస్ సిలిండర్లను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లేమ్ ప్లస్ గ్యాస్ వినియోగంతో అధిక ఉష్ణోగ్రత, అధిక సామర్థ్యం, తక్కువ గ్యాస్ ఖర్చు అవుతుందన్నారు. సమపాళ్లలో ఉష్ణోగ్రత, మంట నిలకడగా రావడం వల్ల సమయం ఆదా అవుతుందని, తద్వారా 10 శాతం వరకు గ్యాస్ ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ డీజీఎం మనోజ్ గోయల్, హెచ్‌పీ డీలర్స్ ఏ.వి సత్యమోహన్, పి.వెంకటేశ్వరావు, రామకృష్ణ రాజు, మోహన్‌రెడ్డి, రాజిరెడ్డి, రమేష్, శంకర్, మనుకార్తీ, శ్యాంకుమార్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



రామన్నపేట : వరంగల్ లోకల్ బస్టాండ్ ఫ్లాట్‌ఫాం నంబర్-1 వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు ఇంతేజార్ గంజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. మృతుడు 50 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉంటాడని తెలిపారు. ఈ మృతదేహాన్ని వరంగల్ బస్టాండ్‌లో ప్యాసింజర్ గైడ్‌గా విధులు నిర్వహిస్తున్న గంజి రాజేందర్ గురువారం ఉదయం 6 గంటల ప్రాంతంలో గుర్తించారన్నారు. సదరు వ్యక్తికి స్పృహ లేకపోవడంతో 108కు సమాచారం అందించినట్లు తెలి పారు. 108 సిబ్బంది అక్కడికి చేరుకుని పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు



మహిళాసంఘాల సభ్యులకు చెక్కు అందజేస్తున్న మంత్రి

పాలకుర్తి : తెలంగాణ రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల బలోపేతమే సీఎం కేసీఆర్ లక్ష్యమని, రుణాలు పొందిన మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం పాలకుర్తిలో నిర్వహించిన మహిళా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం సీఎం కేసీఆర్ నేతృత్వంలో స్వయం సహాయక సంఘాలకు రూ. 20 వేల కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. ఇప్పటికే ప్రతీ మహిళకు రూ. 3 లక్షల రుణాలు అందజేశామన్నారు. ఈ డబ్బుతో మహిళలు వివిధ ఉపాధి మార్గాల ద్వారా ఆర్థికంగా ఎదిగారన్నారు. రాష్ట్రంలో 4 లక్షల 50 వేల సంఘాల్లో 45 లక్షల పైగా సభ్యులు ఉన్నారన్నారు. రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన ప్రతీ మహిళ సంఘంలో సభ్యురాలిగా ఉండాలన్నారు. ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్ పర్సన్ ఉషాదయాకర్‌రావు మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వం అందజేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మంత్రి ఎర్రబెల్లి.. మహిళా సంఘాల సభ్యులకు రూ. 5 కోట్లు విలువైన రుణాలు అందజేశారు. సమావేశంలో అడిషనల్ డీఆర్‌డీవో నూరొద్దీన్, ఎంపీపీ నాగిరెడ్డి, జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, ఆపరేషన్ ఎస్‌బీఐ షేక్‌అబ్దుల్ రహీం, మార్కెట్ చైర్మన్ ముస్కు రాంబాబు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, సహకార సొసైటీ చైర్మన్ బొబ్బాల అశోక్ రెడ్డి, వీరమనేని యాకాంతరావు, తదితరులు పాల్గొన్నారు.

'మనుషత్వం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈఓ వాసంతి

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు డి.దుర్గాచారి రచించిన రచించిన 'మనుషత్వం-సాంగ్స్ ఆఫ్ హ్యూమనిటీ' పుస్తకాన్ని డీఈఓ వాసంతి ఆవిష్కరించారు. గురువారం పాఠశాలలో పుస్తకాన్ని ఆవిష్కరించిన సందర్భంగా డీఈఓ, ఉపాధ్యాయులు.. రచయితను అభినందించారు. అనంతరం పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎస్‌ఎంసీ సభ్యులు, పొదుపు సంఘాల మహిళలు మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, సృజనాత్మకతను పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని సూచించారు. హెచ్ ఎం టి.సుజాత, ఎంఈఓ చదువుల సత్యనారాయణ, ఎస్‌ఎంసీ సభ్యులు కొక్కొండ శ్రీకాంత్, గోదాసి రమేశ్ పాల్గొన్నారు.

వృద్ధుడి హత్య కేసులో దర్యాప్తు వేగవంతం

- బృందాలుగా వీడిన పోలీసులు..
- నిందితుల కోసం గాలింపు

ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్ ఎస్‌ఆర్‌ఆర్ తోటలో సంచలనం రేకెత్తించిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి నాముతాబాజీ రాంచందర్(65) హత్య కేసులో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. సీపీ ఏవీ రంగనాథ్ ఆదేశాలు మేరకు ఏసీపీ బోనాల కిషన్ ఆధ్వర్యంలో సీఐ సురేష్ నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్, స్టేషన్ పోలీసులు నాలుగు బృందాలుగా వీడి నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు. వృద్ధుడిని హత్య చేసి పరారైన ఇద్దరు వ్యక్తులు నంబర్ ప్లేట్ లేని ద్విచక్రవాహనంపై ఎటువైపు వెళ్లారు? బైక్‌ను ఎక్కడ పడేసి ఉంటారు? లేదా బైక్‌పై ప్రయాణం చేసి ఉంటారా? అనే అంశంపై దర్యాప్తు చేపడుతున్నారు. ఘటనా స్థలిలో క్లూస్ టీం సేకరించిన ఆధారాలను కూడా పోలీసులు పరిగణలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. మృతుడి కుమారుడు ప్రదీప్‌చందర్ పేర్కొనట్లు 'గతంలో పత్తిపాకశాయంపేటకు చెందిన ఓ వ్యక్తికి మృతుడు రాంచందర్ మధ్య భూ వివాదం కొనసాగుతోంది. ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తోంది. భూ వివాదంలో భాగస్వామి అయిన వ్యక్తే రాంచందర్‌ను హత్య చేసి ఉంటాడా..?' అనే విషయాన్ని ఆరాతీస్తున్నారు. హత్యకు గురైన వృద్ధుడితో వివాదం ఉన్న వ్యక్తితో పరిచయం ఉన్న వ్యక్తులను కూడా విచారించి వదిలేసినట్లు తెలుస్తోంది. వృద్ధుడి కుటుంబ సభ్యులను కూడా పోలీసులు అనుమానిస్తున్నట్లు తెలుస్తోంది. వారిని కూడా విడివిడిగా విచారించే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా, వృద్ధుడి హత్యకు సుపారీ ఇచ్చినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నేడు దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ

కాశోజీ సెంటర్: రాష్ట్ర సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు ఎంపిక చేసిన ప్రత్యేక అవసరాలు గల (దివ్యాంగులు) విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ, ఏఎల్‌ఐఎంసీఓ ఆధ్వర్యంలో శుక్రవారం శంభునిపేట ప్రభుత్వ పాఠశాలలో ఉచిత ఉపకరణాలను పంపిణీ చేయనున్నట్లు డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం జిల్లాలోని 159 దివ్యాంగ విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఆమె పేర్కొన్నారు. వీల్‌చైర్స్, ట్రై సైకిల్స్, రోలేటర్స్, ఎంఎస్‌ఐఈడీ కిట్స్, వినికిడి యంత్రాలు, చేతి కర్రలు, చంక కర్రలు, కాలిపర్స్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన దివ్యాంగ విద్యార్థులు అందరూ హాజరయ్యేలా చూడాలని ఆయా మండలాల ఐఈఆర్పీలకు సూచించారు.

ఎఫ్‌ఎల్‌ఎన్ సర్వే సమర్థవంతంగా చేపట్టాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సారయ్య

కాశోజీ సెంటర్ : ఎఫ్‌ఎల్‌ఎన్ సర్వేను సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.సారయ్య విద్యార్థులకు సూచించారు. నగరంలోని శంభునిపేట ప్రభుత్వ పాఠశాలలో పాఠశాల హెచ్‌ఎం శారదాబాయి అధ్యక్షతన టీటీసీ, డిగ్రీ విద్యార్థులకు ఎఫ్‌ఎల్‌ఎస్ ఫౌండేషన్, లిట్రసీ, న్యూమరసీ సర్వే గురించి నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన సారయ్య మాట్లాడుతూ విద్యార్థులు శిక్షణ పొంది ఎఫ్‌ఎల్‌ఎన్ సర్వేను సమగ్రంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలు వేముల నరేష్, కొమ్ము శ్రీధర్, చిలువేరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నవడ్డేపల్లి చెరువులో ఆక్రమణల తొలగింపు

- రెవెన్యూ, కార్పొరేషన్, ఇరిగేషన్ పోలీసుల జాయింట్ ఆపరేషన్



గుడిసెలను తొలగిస్తున్న బల్దియా సిబ్బంది

వరంగల్ : వరంగల్‌లోని చిన్నవడ్డేపల్లి చెరువులో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న డేరాలను రెవెన్యూ, కార్పొరేషన్, ఇరిగేషన్, పోలీసులు జాయింట్ ఆపరేషన్ చేసిన గురువారం తెల్లవారుజామున తొలగించారు. చిన్నవడ్డేపల్లి చెరువులో కొంత మంది ఇళ్ల స్థలాల కోసమంటూ తాత్కాలికంగా డేరాలను వేసి ఆక్రమించుకున్నారు. దీంతో వారు వర్షపు నీరు రాకుండా మట్టి పోశారు. ఎగువ నుంచి వచ్చిన వరద నీరు చెరువులోకి సాఫీగా వెళ్లకపోవడంతో 14, 19, 20, 21 డివిజన్లలోని పలు కాలనీలు ఇటీవల భారీ వర్షాల సమయంలో ముంపునకు గురయ్యాయి. పరిశీలించిన అధికారులు అడ్డుగా ఉన్న ఆక్రమణలు తొలగించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. భారీగా పోలీసు బలగాలను మోహరించి గుడిసెలు వేయించేందుకు సహకరించిన నాయకులను ముందుగా అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి అడ్డంకులు లేకుండా చెరువు మొత్తం ప్రక్షాళన చేశారు. చెరువులోని అన్ని ఆక్రమణలు తొలగించడంతో ముంపు ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆర్డీఓ, తహసీల్దార్, ఏసీపీ బోనాల కిషన్, ఇంతేజార్‌గంజ్ సీఐ ముస్కే శ్రీనివాస్, ఇరిగేషన్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.